




హోరెత్తిన నిమజ్జనం







క్రేన్ సాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం





వినాయక ఘాట్ వద్ద విగ్రహాలు





గంగ ఒడిని చేరు గణనాథుడు



గంగహారతి ఇస్తున్న అర్చకులు







నిమజ్జనానికి తరలివస్తున్న వినాయకుడు





వినాయక ఘాట్ పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి

- 2 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం
- డీజేల హోరు.. యువత జోరు..
- ముగిసిన గణేశ్ ఉత్సవాలు

వెళ్లి రావయ్యా గణపయ్యా.. మళ్లీ రావయ్యా లంబోదరా అంటూ కర్నూలులో గణేశ్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. ప్రజలు వేలాదిగా రోడ్ల పైకి రావడంతో కర్నూలు కాషాయమయంగా మారింది. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి సాగనంపారు. 9 రోజుల పాటు అశేష భక్తుల పూజలందుకున్న గణనాథుల నిమజ్జనం కర్నూలులో ఘనంగా పూర్తయింది. నగరంలో శోభాయాత్ర ఆద్యంతం కనులవిందుగా సాగింది. వినాయక విగ్రహాలకు భక్తులు నీరాజనం పలికారు. డీజే పాటలు.. డప్పు దరువులు, ఆట పాటలు, బాణసంచా మోతలతో నగర వీధులన్నీ హోరెత్తాయి. ఈ సందర్భంగా సాగిన శోభాయాత్రలో చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. సామూహికంగా నృత్యాలు చేస్తూ.. రంగులు చల్లుకుంటూ గణనాథుడిని సందడిగా ఊరేగించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో భారీగా అన్నదానాలు చేశారు. కర్నూలు నగర వ్యాప్తంగా ఉన్న రెండు వేలకు పైగా విగ్రహాలు వినాయక ఘాట్ సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జనం నిర్వహించారు. దీంతో జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో కర్నూలు మార్మోగింది. గురువారం ఉదయం మొదలైన నిమజ్జనోత్సవం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది.

-కర్నూలు కల్చరల్/ కర్నూలు న్యూసిటీ

వివరాలు 4లో.

యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రానికి
ఉత్తమ అవార్డు

- పురస్కారం అందుకున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి



అవార్డు అందుకుంటున్న యూనిట్ హెడ్ ధనలక్ష్మి

బనగానపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం మూడో సంవత్సరం కూడా ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపికైనట్లు యూనిట్ హెడ్, శాస్త్రవేత్త ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ సంస్థ, హైదరాబాద్ తరుపున 2024-25 సంవత్సరానికి గానూ జోన్లలో గల ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉత్తమ కేవీకేగా యాగంటిపల్లెకు దక్కిందన్నారు. ఈనెల 2 నుంచి 4 వరకు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా 72 కృషి విజ్ఞాన కేంద్రాలు పోటీ పడినట్లు తెలిపారు. ఇందులో యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ అవార్డు లభించిందన్నారు. నాణ్యమైన విత్తనాలు, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, నారు, మొక్కలు పెంచే సదుపాయం విస్తరణ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు కేవీకేలో డెమో యూనిట్ల నిర్వహణకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. వైస్ చాన్సలర్ అవినాశలింగం, డాక్టర్ భారతి, హరిశంకర్, డాక్టర్ శివనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆమె తెలిపారు.

ఎంపీడీవోలుగా పదోన్నతులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న నలుగురు పరిపాలన అధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల పరిపాలన అధికారిగా పని చేస్తున్న పి.దస్తగిరిబాబుకు, పాములపాడు మండల పరిపాలన అధికారిగా పని చేస్తున్న ఎం.గాయత్రికి, బనగానపల్లె ఏవో ఎస్.నాగరాజుకు ప్రమోషన్లు దక్కాయి. అదే విధంగా కర్నూలు డ్వామాలో పని చేస్తున్న ఏవో టి.కృష్ణమోహన్‌కు కర్నూలు జిల్లాకు కేటాయించారు. వీరికి త్వరలోనే మండలాలను కేటాయిస్తారని అధికారులు తెలిపారు.

నంద్యాల జిల్లాకు పవర్

- పవర్‌ప్రాజెక్టులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్
- కొలిమిగుండ్ల, అవుకులో ఏర్పాటుకు నిర్ణయం
- సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడులు

4

నవసమాజ నిర్మాతలు
గురువులు

- విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకం
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులకు 48 మంది ఎంపిక

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి జీవితంలో గురువు స్థానం అపారమైంది. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువు మనకు జీవనమార్గాన్ని చూపిస్తారు. పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా, విలువలు, నైతికతలు, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు నేర్పించేది ఉపాధ్యాయులే. అందుకే ఉపాధ్యాయుని స్థానాన్ని గురువు బ్రహ్మ, గురువు విష్ణు, గురువు దేవో మహేశ్వర అని శాస్త్రాలు ప్రశంసించాయి. ఏటా సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. విద్య అనేది కేవలం ఉపాధి సాధనం కాదు, మనిషిని సమగ్రంగా తీర్చిదిద్దే శక్తి అని రాధాకృష్ణన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గతంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారి అభిప్రాయాలను, బోధనలో తీసుకున్న మెలుకువలను ఈ విధంగా వివరించారు.

జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులకు 48 మంది గురువుల ఎంపిక

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లాలో శుక్రవారం 48 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశారు. అందులో 40 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు అధ్యాపకులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిఫారసు చేసిన ఇద్దరు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వనున్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ హాల్‌లో ఉపాధ్యాయులను అవార్డులను అందజేయనున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.



తరగతి గదిలో విద్యార్థులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

సమాజంపై అవగాహన ఉండాలి



2024 జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందాను. విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు సమాజంపై అవగాహన ఉండాలి. దీనివల్ల భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది. ఉపాధ్యాయుడు ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉంటూ వారితో కలిసిపోవడం వల్ల విద్యార్థులు మరింత ఉత్సాహంగా ఉండే అవకాశం ఉంటుంది.

- శైలజ, శ్రీరామనగర్ ప్రాథమిక పాఠశాల, గోస్పాడు మండలం

నైపుణ్యాలు తప్పనిసరి



2023లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందాను. నేటి రోజుల్లో పిల్లలకు తప్పనిసరిగా స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో రాణిస్తే విద్యార్థులు తప్పనిసరిగా ఉన్నతస్థానాలకు చేరుకుంటారు. మాతృభాషలోనే విద్యార్థులకు బోధించడం వల్ల విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందుతాయి. ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా బోధనా పద్ధతిని మార్చుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి భావోద్వేగాలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు నడుచుకోవాల్సి ఉంటుంది.

- వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు, ఎంపీపీ పాఠశాల, కొట్టాలచెరువు, ఆత్మకూరు మండలం

పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలి



2024లో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందాను. పెద్దలు, గురువులను గౌరవించేలా పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. జీవితంలో విద్యార్థి రాణించాలంటే ధైర్యం, పట్టుదలతో పాటు నీతి, సంకల్పం వంటి వాటిని బోధనలో భాగంగా చేసుకుని విద్యార్థికి మేళవించి చెప్పడం వల్ల సమాజంలో ఒక విద్యార్థి ఉత్తమ విద్యార్థిగా ముందుకు వెళ్తాడు. ప్రతి ఉపాధ్యాయుడు మంచి ఉపాధ్యాయునిగా మారడానికి సమయపాలన పాటించాలి. విద్యార్థుల ఆలోచన, మానసిక, శారీరక స్థాయిని బట్టి ఉపాధ్యాయుడు వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

- బండి యల్లాసుబ్బయ్య, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల మండలం, తెలుగు ఉపాధ్యాయుడు



క్షేత్రస్థాయిలో విద్యార్థులకు బోధన

పోతిరెడ్డిపాడును పరిశీలించిన కేఆర్‌ఎంబీ ఇన్‌చార్జి చైర్మన్

జూపాడుబంగ్లా/ పాములపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్యబోర్డు (కేఆర్‌ఎంబీ) పరిధిలోకి వచ్చే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, బనకచర్ల క్రాస్ హెడ్‌రెగ్యులేటర్లను గురువారం బోర్డు ఇన్‌చార్జి చైర్మన్ పాండే, సభ్యులు కేకే జాన్‌గ్రిడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం, నీటిలభ్యతతో పాటు, జలాశయాల వివరాలను నీటిపారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జూన్‌లోనే వరదలు వచ్చాయని, గత 20ఏళ్లలో ఎన్నడూ ముందుగా వరదలు రాలేదని ఇన్‌చార్జి చైర్మన్‌కు అధికారులు వివరించారు. బనకచర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి మళ్లింపు, కాలువలు, జలాశయాలపై ఆరా తీశారు. వీరివెంట నీటిపారుదలశాఖ ఎస్ఈ ప్రతాప్, ఈఈ నాగేంద్రకుమార్, డీఈలు సుబ్రహ్మణ్యం రెడ్డి, నగేష్, రఘురామరెడ్డి, ఏఈలు విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేంద్ర, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ ఏడీఈ పవన్, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇంజనీర్లతో ఎన్‌సీఎల్ విద్యుత్ ప్రాజెక్టులో సమావేశం నిర్వహించి చర్చించారు. రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షులు బొజ్జదశరథరామిరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకుని కృష్ణానది జలాలను గతంలో మాదిరిగానే రాయలసీమకు నీటిని అందించాలని చైర్మన్ పాండేకు వినతిపత్రం అందజేశారు.



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న కేఆర్‌ఎంబీ ఇన్‌చార్జి చైర్మన్ పాండే, నీటిపారుదలశాఖ అధికారులు

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్ల దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోథా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

నంద్యాల జిల్లాకు పవర్

- పవర్‌ప్రాజెక్టులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్
- కొలిమిగుండ్ల, అవుకులో ఏర్పాటుకు నిర్ణయం
- సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడులు


మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

నంద్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. అందులో భాగంగా నంద్యాల జిల్లాపై వరాలజల్లు కురిపించారు. వ్యాపారులు, రైతులు, నిరుద్యోగులకు బాసటగా నిలిచేలా జిల్లాలో రెండు కీలక ప్రాజెక్టులకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఆ రెండు ప్రాజెక్టులు కూడా రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రానిధ్యం వహిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి నియోజకవర్గం బనగానపల్లెకు దక్కాయి. క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ(బార్మర్) ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ అవుకు మండలంలోని అవుకు, సింగనపల్లి, కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామాల్లో రెండు సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ రెండు ప్రాజెక్టులు సుమారు రూ.1,500 కోట్లు పెట్టుబడులతో సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నారు.

ఇప్పటికే భూ సేకరణ...

అవుకు మండల పరిధిలోని అవుకు, సింగనపల్లి గ్రామాలకు చెందిన రైతులతో సుమారు 1,250 ఎకరాల భూమిని సేకరించినట్లు సమాచారం. సదరు సంస్థ నిర్వాహకులు సైతం నిబంధనలు ప్రకారం ఆయా రైతులతో అగ్రిమెంట్‌లు తదితర ప్రక్రియను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మొదలు పెట్టినట్లు ఆ వర్గాల నుంచి తెలిసింది. ఇప్పటికే 50శాతం ప్రక్రియ పూర్తయింది. అదేవిధంగా కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో సదరు సంస్థ 38 ఎకరాలను గుర్తించింది. త్వరలో మిగతా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. తాజాగా మంత్రివర్గం తీసుకున్న ఈ కీలక నిర్ణయాలపై నంద్యాల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కవి జంద్యాల రఘుబాబు పుస్తకాలపై సమాలోచన

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంద్యాల రఘుబాబు పదవీ విరమణ సందర్భంగా ఆయన రాసిన పుస్తకాలపై సమాలోచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్రవంతి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని హోసన్న మందిరం సమీపంలో ఉన్న యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో స్రవంతి జిల్లా నాయకుడు మధు బాలగౌని కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతారని తెలిపారు. జంద్యాల రాసిన అక్షరకాంతులు విమర్శ గ్రంథ పరిచయం కవి జి. వెంకటకృష్ణ, పెట్టుడు రెక్కలు పుస్తకాన్ని ఆర్‌యూ తెలుగు శాఖ సహాయ ఆచార్యులు జి. అరుణ, నెర్రెలు కవితా సంపుటిని విరసం నాయకుడు డాక్టర్ నాగేశ్వరాచారి పరిచయం చేస్తారని చెప్పారు. అద్దంలో బొమ్మలు కథా సంపుటిని స్రవంతి జిల్లా నాయకురాలు ఎన్ నాగమణి, సైరా మా బళ్లారి పాటల పుస్తకాన్ని స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ పరిచయం చేస్తారని తెలిపారు.

హోరెత్తిన నిమజ్జనం


భక్తులతో కిక్కిరిసిన నగర వీధులు

కర్నూలు కల్చరల్/ న్యూసిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా నాలుగు ప్రాంతాల నుంచి ర్యాలీలు మొదలయ్యాయి. పాతనగరంలోని శ్రీరాంబొట్ల దేవాలయం వద్ద గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించగా, ఈ ఊరేగింపు వన్‌టౌన్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్దమార్కెట్, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ మీదుగా కేసీ కెనాల్ వినాయక ఘాట్ వరకు కొనసాగింది. రెండో ఊరేగింపు నంద్యాల చెక్‌పోస్టు నుంచి గాయత్రి ఎస్టేట్ మీదుగా చేరుకుంది. ఇటు బళ్లారి చౌరస్తా నుంచి కొత్తబస్టాండు, మౌర్యఇన్, రాజ్‌విహార్ మీదుగా మూడో ఊరేగింపు కొనసాగింది. నాలుగో ఊరేగింపు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంకు, గాయత్రి ఎస్టేట్ మీదుగా ఘాట్‌కు చేరింది. నగరంలోని ప్రధాన రహదారుల్లోని దుకాణాల నిర్వాహకులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసి వేశారు. అలాగే గురువారం పలు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.


వినాయకా.. వీడ్కోలిక

ప్రజలు సుభిక్షంగా ఉండాలి : కలెక్టర్ రంజిత్ బాషా

సిరి సంపదలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని గణనాథుడిని కలెక్టర్ పి. రంజిత్ బాష వేడుకున్నారు. ఉదయం రాంబొట్ల దేవాలయం వద్ద వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసిన మంటపం వద్ద ఆయన పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపి డా. బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ, ఆదోని ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ బి. పార్థసారధి, జేసీ బి.నవ్య, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, నగర మేయర్ బీవై.రామయ్య, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కేసీ కెనాల్ ఘాట్

నగర నడిబొడ్డునగల కేసీ కెనాల్ ఒడ్డున ఉన్న వినాయక ఘాట్‌లో అంగరంగవైభవంగా గణేశ్ మూర్తుల నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. ఈఏడాది నిర్ణీత సమయం కన్నా గంట ఆలస్యంగా కార్యక్రమాలను ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణపతి మూర్తులను భారీ వాహనాల్లో, ఊరేగింపుగా తీసుకువచ్చిన గణేశ్ విగ్రహ మూర్తులను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారధి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగర మేయర్ బీవై రామయ్య, ఆర్డీవో సందీప్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి దంపతులు, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఏపీ స్టేట్ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, కే క్రిష్ణన్న, మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణ చేసి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణపతి విగ్రహానికి, నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన గణపతికి పూజలు చేసి శాస్త్రోకంగా గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేసీ కెనాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కొట్టే చెన్నయ్య, పరశురాముని రామకృష్ణలు వ్యాఖ్యానం చేస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాల ప్రాశస్థాన్ని వివరిస్తూ భక్తుల్లో ఆసక్తిని రేకెత్తించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు రంగస్వామి, గూడా సుబ్రహ్మణ్యం, నందడి మహేష్, నందడి సుధాకర్, అక్కెం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. కేసీ కెనాల్ ఘాట్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు అందజేశారు.

లడ్డూను రూ.6 లక్షలకు కొనుగోలు చేసిన ఎంపీ శబరి

పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద నిమజ్జనోత్సవ ర్యాలీ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు పాడిన వేలం పాటలో అత్యధిక ధర రూ.6,01,000లకు లడ్డూ వేలం పాటపాడి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్వామివారి లడ్డూ దక్కించుకున్నారు.







ఆఖరికి అవస్థలే..!

● శ్మశాన స్థలం కబ్జాతో అంత్యక్రియలకు ఇబ్బందుల

చాగలమర్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొందరి భూదాహం శ్మశానాన్ని కబ్జా చేసేవరకూ వెళ్లింది. దీంతో ఆఖరి మజిలీకి కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. శ్మశానాలను సైతం ఆక్రమించుకోవడం వల్ల అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. చాగలమర్రి మం డలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో దళితులకు కేటాయించిన స్మశాన స్థలం ఆక్రమణకు గురైంది. దళిత కాలనీలో ఎవరైన మృతి చెందితే అంత్యక్రియలు, మృతదేహాన్ని పూడ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. ఈ క్రమంలో గురువారం కరకాల యాకోబ్ (68) అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శవాన్ని పూడ్చేందుకు స్థలం లేక అవస్థలు పడ్డారు. శవపేటికతో గ్రామ సమీపంలోని వంక వద్దకు తీసుకెళ్లి నీటిలో నుంచే మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. స్మశాన స్థలం లేక వంక వెంబడి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. గతంలో 98 సర్వే నంబర్‌లో 45సెంట్ల స్థలాన్ని స్మశానం కోసం అధికారులు గతంలో కేటాయించారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమిం చుకోవడంతో సమస్య తలెత్తిందని దళితులు ఆరోపిస్తున్నారు. స్మశాన స్థలానికి వెళ్లాలంటే రహదారి మధ్యన 16 అడుగుల లోతు వంక ఉంది. వంక ప్రవహించే సమయంలో శవాన్ని పూడ్చేందుకు వెళ్లాలంటే నరకయాతన తప్పదు.


తోడెండ్లపల్లెలో మృతదేహంతో వంకను దాటుతున్న దళితులు

భావి వెలుగుకు మార్గదర్శి

- కనిపించే దైవం గురువులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గురువు అనే పదంలోనే చీకటి నుంచి వెలుగుకు దారి చూపే అర్థం దాగి ఉంది. పాఠం చెప్పేటప్పుడు ఉపాధ్యాయుడు ఎంతో శాంతంగా ఉంటూ శిష్యులను బిడ్డలతో సమానంగా భావించి వారికి మరింత జ్ఞానాన్ని పంచుతాడు. సృష్టిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపం గురువుగా భావిస్తారు. ఈ క్రమంలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని భావించి వారి కోసం ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేస్తున్నారు. అందుకే ఉత్తమ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతి ఏటా సెప్టెంబరు ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం రోజున వారికి సత్కారాలు చేస్తోంది.

విద్యాబోధనలో వినూత్నం

- టీచింగ్ టెర్నింగ్ మెటీరియల్ ద్వారా విద్యాబోధన



దృశ్యాలను చూపుతూ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు వినూత

పత్తికొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలు సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు వినూత్న పద్ధతిని ఎంచుకున్నారు ఉపాధ్యాయురాలు వినూత. పుస్తకాల్లో అక్షరరూపంలో ఉన్న పాఠాలను దృశ్యరూపకంలో చూపుతూ పాఠాలు బోధిస్తూ సరికొత్త విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. పత్తికొండ మండలం హోసూరు ఎంపీపీ (డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యురాలిగా పనిచేస్తున్న గజ్జల వినూత కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం 'హ్యాపీచిల్డ్రన్స్' పేరిట వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటుచేశారు. పాఠశాలకు ఎవరైనా విద్యార్థులు హాజరు కాకపోతే వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులను పాఠశాలకు రప్పించేలా చేస్తున్నారు. పాఠశాలకు రాని విద్యార్థులకోసం ఆ రోజు జరిగిన పాఠ్యాంశాలను వీడియోలో రికార్డుచేసి వాట్సప్‌గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. దీంతో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు ఆ వాట్సప్‌లోని పాఠాలను వింటున్నారు. వినూత సేవలను గుర్తించిన విద్యాశాఖ 2023లో ఉత్తమ జిల్లా ఉపాధ్యాయురాలిగా సన్మానించింది. పాఠశాల విద్యార్థులకే కాకుండా దృశ్యరూపక పాఠ్యాంశాలు అందరికీ అందేలా వీడియోలను యూట్యూబ్‌లో ఉంచుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

పాఠ్యాంశాలే కాదు.. పోటీ పరీక్షలకూ శిక్షణ

- ఐదేళ్లలో 27 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక
- హెచ్‌ఎం చంద్రశేఖర్‌ను మెచ్చుకుంటున్న తల్లిదండ్రులు



విద్యార్థులకు పాఠం చెబుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

తుగ్గలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలే కాదు.. ఒకటో తరగతి నుంచే పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు మండలంలోని మిద్దె తండా ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్. అంకితభావంతో పనిచేస్తున్నా ఆ హెచ్‌ఎంను తల్లిదండ్రులు మెచ్చుకుంటున్నారు. 2021 నుంచి ఇదే పాఠశాలలో పనిచేస్తున్నారు. నాలుగో తరగతి అనంతరం ఐదో తరగతిలో గురుకుల పాఠశాలల్లో సీటు సాధించేలా శిక్షణ ఇచ్చారు. 2021లో ఇద్దరు విద్యార్థులు, 2022లో నలుగురు, 2023లో ముగ్గురు, 2024లో నలుగురు, 2025లో 14 మంది గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం విశేషం. మిద్దె తండా, చిగుర్ల గుట్ట తండాల్లో ప్రతి ఒక్కరూ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో విద్యను చెప్పించే స్తోమత లేక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులు వెళ్లి విద్యనభ్యసించే వారు. అనంతరం ఏదైనా హాస్టల్స్‌లో సీట్లు వస్తే చదివించేవారే తప్ప.. లేకపోతే చదువులు మాన్పించి పనులకు తీసుకెళ్లేవారు. అయితే చంద్రశేఖర్ ఈ పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యార్థులకు శిక్షణ ఇచ్చి గురుకులాలకు ఎంపికయ్యేలా కృషి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడానికి ఆసక్తి చూపుతున్నారు. మారుమూల ప్రాంతమైన గిరిజన ప్రాంతంలో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు అందించడం ఎంతో సంతోషమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది జూన్‌లో హెచ్‌ఎంను గ్రామస్థులు ఘనంగా ఊరేగింపు కూడా నిర్వహించడం ఆయన కృషికి నిదర్శనం. హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సాధారణ పాఠ్యాంశాల బోధనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే శిక్షణ అందిస్తూ విద్యార్థులను ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని నింపుతూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారాలు అందిస్తుండటంతో ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా కృషి చేస్తున్నామన్నారు.

ఆ ఉపాధ్యాయుడు ఆదర్శం

- సగం జీతం పేద విద్యార్థుల కోసమే



మైకు ద్వారా పాఠాలు చెబుతున్న నిరంజన్ కుమార్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్నారు ఆదోని పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నిరంజన్ కుమార్. విద్యార్థులకు తరగతి గదిలో తాను చెప్పే పాఠం అందరికి వినిపించేలా తన సొంత ఖర్చులతో మైక్ కొని పాఠ్యాంశాలు బోధిస్తూ ఎందరో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ఉద్యోగాన్ని కర్తవ్యంగా భావించి బోధనలో మెలుకువలు నేర్పుతూ ఉత్తమ ఫలితాల కోసం కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా తన సబ్జెక్టులో సందేహాలు నివృత్తి చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నారు. చదువుతోపాటు మానవ సంబంధాలు, నైతిక విలువలు వంటి తెలుపుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు తల్లిదండ్రులు లేని ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత లేని వారిని దత్తత తీసుకొని ఎంతో మందికి చదువులు చెప్పిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిపట్ల అంకితభావం ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని తాను చేస్తున్న వృత్తికి అంకితభావంతో పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏ అవసరం ఉన్నా తన దగ్గరకు వస్తే అవసరాన్ని తీరుస్తున్నారు. నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్, ఎన్ఎంఎంఎస్, పరీక్ష పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోసం ఉచితంగా సాయంత్రం వేళలో పాఠశాలలోనే కోచింగ్ ఇస్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఓ విద్యార్థిని నాన్న చనిపోవడంతో ఉన్నత చదువులు చదువుకోలేని పరిస్థితి ఆ విద్యార్థిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు రావడానికి కృషి చేసి చదువుకు అయ్యే ఖర్చులను మూడేళ్లుగా ఆయన భరిస్తున్నారు. అంతేకాదు ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థిని పాఠశాల టాపర్‌గా రావడంతో చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తూ వారిద్దరిని దత్తత తీసుకుని చదివిసున్నారు.

డ్రగ్స్ నివారణకు కృషి

- ఉత్తమ అధ్యాపకురాలిగా ప్రొఫెసర్ అనూష



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణలో విద్యార్థుల్లో చైతన్యం తెచ్చి యువతలో మార్పు తీసుకొచ్చిన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల అధ్యాకురాలు ప్రొఫెసర్ బి. అనూషకు ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు వరించింది. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కోనశశిధర్ పలువురు ఆధ్యాపకులను ఎంపికి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మేరకు కర్నూలు జిల్లా నుంచి ప్రొఫెసర్ అనూష ఎంపికయ్యారు. ఈమె జాతీయ స్థాయిలో 24, అంతర్జాతీయ స్థాయిల్లో 11 పరిశోధనలు చేయడంతో పాటు 95 వ్యాసాలు రాసి గుర్తింపు పొందారు. 2024లో బయోటెక్నాలజీని(ఆర్గానిక్ వేస్టు రిప్రెసింగ్ టెక్నికల్ ఫర్ సింథటిక్ కెమిస్ట్రి) ద్వారా ప్రత్యేక పరిశోధనలు చేశారు. వీటితో పాటు యూజీసీలో ఆర్గానిక్స్ పై ఎన్నో పరిశోధనలు చేశారు. పీజీ, యూజీ కళాశాల పరిధిలో కెమిస్ట్రి విభాగంలోని సెంట్రల్ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీతో పలు ఉమ్మడి రాష్ట్రం, జిల్లాలోని పలు కళాశాలల్లో దాదాపు 14 సంవత్సరాలుగా సేవలు అందించారు. ప్రస్తుతం సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ చీఫ్‌గా బాధ్యతల్లో ఉంటూనే అనేక పరిశోధనలు, వ్యాసాలు చేస్తున్నారు. ఇటీవల ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధానికి సంబంధించిన పలు కార్యక్రమాలు చేపట్టారు అనూష ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అమరావతిలో శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ అద్యాపక అవార్డును అందుకోవడం ఊహించనిదని తెలిపారు.

కౌతాళం అధ్యాపకుడికి రాష్ట్రస్థాయి అవార్డు



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజి అధ్యాపకుడిగా పనిచేస్తున్న మలిగే.సంతోష్ కుమార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో సంతోష్ కుమార్ ఉత్తమ అధ్యాపక అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి అందుకోనున్నారు. నందవరం గ్రామానికి చెందిన ఈయన ఆదోనిలో స్థిరపడ్డారు. ఈయన విద్యాభ్యాసం గుంతకల్లులోనే కొనసాగింది. 1994లో కర్నూలు శంకరాస్ కళాశాలో బీఈడీ పూర్తి చేశారు. 1997డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్(జువాలజి) ఎంపికై గుంతకల్లు మండలం కనేకల్ పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. 2001 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ నుంచి జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎం.సంతోష్ కుమార్ మాట్లాడుతూ తనకు అవార్డు రెట్టింపు ఉత్సాహన్ని ఇస్తోందన్నారు. బాధ్యతను పెంచిందన్నారు. ఇదే స్ఫూర్తిని తీసుకొని విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన బోధన చేసేందుకు కృషి చేస్తానన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న తాసిల్ హనుమంతు (50) అనే రైతు అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. హనుమంతు నాలుగు ఎకరాల పొలంలో సాగు చేసుకుంటూ, అలాగే వ్యవసాయ పాటు కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయంలో నష్టం రావడంతో నాలుగేళ్ల క్రితం రెండెకరాల పొలాన్ని విక్రయించారు. మరో రెండెకరాలలో కంది పంటను సాగుచేసేవారు. సాగుకోసం దాదాపు రూ.8 లక్షలు అప్పు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరివేసుకున్నారు. హనుమంతుకు భార్య, తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసుకొని పోస్టుమా ర్టం నిమిత్తం మృతదే హాన్ని గుంతకల్లుకు తరలించారు. కుటుం బాన్ని ఆదుకోవాలని పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర కోరారు.

హత్య కేసు నమోదు

ఆస్పరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగలగల్ గ్రామంలో అహోబిలం అనే వ్యక్తిని హతమార్చడంపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. విచారణ చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటా మన్నారు. అనంతరం హత్యకు గల కారణాలను వెల్లడిస్తామని తెలిపారు. హతుడు గొల్ల అహోబిలం తండ్రి రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద మృతిగా..

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెందిన వీరేంద్ర మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో అవ్వ, తమ్ముడు నిద్రపోతున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి వీరేంద్ర అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని కనిపించాడు. యువకుడి తల్లిదండ్రులు అరుణాచలం వెళ్లడంతో ఎవరూ ఫిర్యాదు చేయలేదు. గురువారం వారు వచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

ఎం.గణపురంలో మహిళ దారుణ హత్య

- వదినను రాడ్‌తో కొట్టి చంపిన మరిది

పగిడ్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాన్ని మానుకోవాలని చెప్పినా వినకపోవడంతో అన్న భార్య సుగాలి నాగమ్మ(60)ని మరిది లోకనాయక్ ఇనుప రాడ్‌తో తలపై కొట్టి చంపిన సంఘటన పగిడ్యాల మండలంలోని ఎం.గణపురం గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... ఎం.గణపురం గ్రామానికి చెందిన సుగాలి నాగమ్మ భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. నలుగురు పిల్లలు హైదరబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటున్నారు. నాగమ్మ గ్రామంలో ఒంటరిగా ఉంటూ కొద్దిరోజుల నుంచి మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని గ్రామస్థుల ఆరోపణ. అయితే ఈ విషయంపై మరిది లోక నాయక్ తరచూ నాగమ్మతో గొడవకు దిగేవాడు. ఇదే సమయంలో గురువారం ఉదయం ఇద్దరి మధ్య పెద్దస్థాయిలో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన లోకనాయక్ ఇనుప రాడ్డుతో నాగమ్మ తలపై కొట్టి చంపేశాడు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ తిరుపాలు, ఏఎస్ఐ శేషయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుమార్తెతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- తుంగభద్ర నదిలో దూకిన ఇద్దరిని రక్షించిన స్థానికులు, పోలీసులు
- మంత్రాలయంలో ఘటన




పోలీసు స్టేషన్‌లో రజిని, కీర్తనతో ఐసీడీఎస్ సూపజర్‌వైజర్

మంత్రాలయం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదిలో బెంగళూరుకు చెందిన రజిని (35), కూతురు కీర్తన(8) తుంగభద్ర నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు అంజి, మల్లికార్జున స్వామి, హోం గార్డు నాగేశ్వర రెడ్డి తల్లి, కూతురిని ఒడ్డుకు చేర్చి వారికి స్థానిక వైద్యులతో వైద్యం చేయించారు. వివరాలివీ.. బెంగళూరుకు చెందిన సుంకార్ తట్టె కాలనీకి చెందిన బీఎస్ రజిని, బీఎస్ శివకుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు పదోతరగతి, రెండో కూతురు కీర్తన రెండో తరగతి చదువుతోంది. రజిని తన ఇంటి పక్కన ఉన్న దివ్య అనే మహిళకు వడ్డీ వ్యాపారుల దగ్గర పూచీకత్తు ఉండి రూ.లక్షల్లో అప్పు ఇప్పించింది. మూడు నెలలైనా దివ్య తప్పించుకొని తిరుగుతోంది. దీంతో అప్పు ఇచ్చిన వారు పూచీకత్తు ఉన్న రజిని అప్పు చెల్పించాలని ఒత్తిడి చేయటంతో ఈనెల 1న చిన్న కూతురును తీసుకొని మంత్రాలయానికి వచ్చింది. తన భార్య, కూతురు కనిపించడం లేదని రజిని భర్త శివకుమార్ బెంగళూరులోని బ్యాగరి హల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మంత్రాయం దగ్గర ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలోకి దూకిన వారిని అక్కడ ఉన్న స్థానికులు, పోలీసులు ప్రాణాలకు తెగించి తల్లి, కూతురిని కాపాడారు. కూతురు కీర్తన తండ్రి సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వడంతో శివశంకర్‌కు సమాచారం ఇచ్చారు. శివశంకర్ బ్యాగర్ హల్లి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడ సీఐ మంత్రాలయం ఎస్ఐ శివాంజల్‌కు ఫోన్‌లో మాట్లాడించారు. ప్రస్తుతం తల్లి, కూతరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుమిత్రమ్మ, అంగన్ వాడీ టీచర్లు భీమేశ్వరి, కల్యాణి సమక్షంలో మంత్రాలయం పోలీసు స్టేషన్‌లో సురక్షితంగా ఉన్నారు. తల్లి కూతుళ్లను కాపాడిన గ్రామస్థులను, పోలీసులను గ్రామస్థులను అభినందించారు.

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో

- మూడు గేట్ల ద్వారా నీటి విడుదల



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్‌కు వరద ప్రవాహం పెరగడంతో 3గేట్లను తెరచి 82,710 క్యూసెక్కులు సాగర్‌కు సాగనంపుతున్నారు. ఎగువ పరివాక ప్రాంతాలైన జూరాల, విద్యుదుత్పత్తి, సుంకేసుల నుంచి మెత్తం 1,64,124 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం నీటిమట్టం గురువారం సాయంత్రం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 209 టీఎంసీలుగా నమెదు అయింది. శ్రీశైలం రెండు విద్యుత్ క్రేందాల్లో అనంతరం 66,327 క్యూసెక్కుల నీటి విడుదలు చేస్తున్నారు.

శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్ఈగా బాలచంద్రారెడ్డి బాధ్యతలు



శ్రీశైలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్.ఈగా బి.బాలచంద్రరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాలచంద్రారెడ్డి ప్రస్తుతం కర్నూలు జలవనరుశాఖ ఎస్ఈ ఐజీ సర్కిల్‌లో పనిచేస్తున్నారు. శ్రీశైలం డ్యాంను సందర్శించి వరద నీటి చేరికలు, క్రస్ట్‌గేట్ల పనితీరు తదితర అంశాలపై ఈఈ వేణుగోపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జలాశయం ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

దిగివచ్చిన వ్యాపారులు

- గ్రేడింగ్ లేకుండా వేరుశనగ కొనుగోలుకు సుముఖత
- సబ్ కలెక్టర్‌తో చర్చలు సఫలం



సబ్ కలెక్టర్‌తో చర్చిస్తున్న వేరుశనగ వ్యాపారులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వేరుశనగ గ్రేడింగ్ విధానం రద్దుకు వ్యాపారులు సుముఖత వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మరోమారు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన వేరుశనగ వ్యాపారులతో చర్చలు జరిపారు. రైతులకు నష్టం కలిగించే గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యాపారులను ఆయన హెచ్చరించారు. ఉదయం చర్చల్లో న్యాయవాదులతో కలిసి హాజరైన వ్యాపారులు గ్రేడింగ్ కొనసాగించాలని, లేకపోతే ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌లో తూకాలు ఏ విధంగా చాట ద్వారా కొనసాగుతాయో ఆ విధంగా ఇక్కడ హమాలీలు తూకాలు వేస్తే అభ్యంతరం లేదంటూ చెప్పుకొచ్చారు. సబ్ కలెక్టర్ వారం రోజులపాటు యథావిధిగా రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడులను గ్రేడింగ్ లేకుండా కొనసాగించాలని, ఏదైనా నష్టం కలిగించే విధంగా ఉంటే తరువాత చూద్దమంటూ వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు కలెక్టర్ మాటకు సమ్మతిస్తూ కొనుగోలు చేస్తామని ముందుకు వచ్చారు. రైతులు ఇంటి వద్దనే బాగా గ్రేడింగ్ చేసుకొని ఆరబెట్టుకొని వేరుశనగను తీసుకురావాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మార్కెట్ యార్డ్‌లో తేమశాతం అధికంగా ఉంటే రాశులుగా కాకుండా వేరుశనగ పరిచి టెండర్‌కి ఉంచవచ్చన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, వేరుశనగ వ్యాపార సంఘం నాయకుడు శరణప్ప నాగరాజు, మస్తాన్ పాల్గొన్నారు.

త్రిమూర్తుల స్వరూపమే గురువు

- బలపం ముక్కపై సూక్ష్మ చిత్రాలు



బలపం ముక్కపై సూక్ష్మ చిత్రాలు



చిత్రకారుడు కోటేష్

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని చిన్న బలపం ముక్కపై వాటర్ కలర్ పెయింటిగ్స్‌తో మైక్రో బ్రష్‌తో గురువు గొప్పతనం తన చిత్రం ద్వారా తెలిపారు. త్రిమూర్తుల స్వరూపమే గురువని త్రిమూర్తులయిన బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అలాగే గురువుకు ఒక విద్యార్థి వందనం చేస్తున్నట్లు చిత్రం గీశారు. గురువు అంటే ఒక మార్గదర్శి అందుకే గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వరా, గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమ:అని గురువులను త్రిమూర్తులతో పోలుస్తారు. గురువు గొప్పతనం గురించి ఎంతో సందేశమిచ్చే చిత్రాన్ని సూక్ష్మ చిత్రాలతో వేశానని కోటేశ్ తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి



మాట్లాడుతున్న శోభారాణి

నందికొట్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నందికొట్కూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి తెలిపారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులకు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి శోభారాణి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరబయ్య, ఏపీఆర్‌టీ సుస్మిత, బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన



లక్ష్మాపురంలో బస్సులను నిలిపి వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పగిడ్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కాలేజీలకు వెళ్లేందుకు సమయానికి బస్సులు నడపాలని విద్యార్థులు కోరారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో విద్యార్థులు ఆందోళన చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గ్రామం నుంచి ప్రతి రోజు వివిధ పాఠశాలలకు, కళాశాలలకు వందమందికిపైగా విద్యార్థులు నందికొట్కూరు పట్టణానికి వెళ్తుంటారన్నారు. అయితే ఉదయం బస్సు సౌకర్యం లేకపోవడంతో సమయానికి చేరుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమయానికి బస్సులు నడుపాలని కోరారు. సుమారు గంటకు పైగా విద్యార్థులు ఆందోళన చేశారు. సమాయనికి బస్సులు నడపాలని లేకపోతే డిపో ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు మద్దిలేటి గౌడ్, గోవిందు, జనసేన నాయకుడు నాగేంద్ర గౌడ్ ఆర్టీసీ అధికారులకు ఫోన్‌లో సమస్యను తెలియజేశారు. నాయకుల హామీతో ఆందోళన విరమించారు.

అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటు

కొత్తపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గు చేటని టీడీపీ నాయకులు పైరెడ్డి నాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. గురువారం నందికుంట గ్రామంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. సమావేశంలో ఓబులేసు, మల్లయ్య, బాలుడు, ప్రహ్లాద, మాసుం, నాగశేషులు, స్వాములు, శేషుడు, తిరుపాల్, మోహన్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో యూరియా దిగుమతి

ఆత్మకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాల నిమిత్తం మరో రెండు రోజుల్లో ఆత్మకూరు సబ్ డివిజన్‌కు 525.32 మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి కానున్నట్లు ఇన్‌చార్జి ఏడీఏ హేమలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిల ఇప్పటివరకు 1916 మెట్రిక్ టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా, 2525.2 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా, 959 మెట్రిక్ టన్నులు సొసైటీల ద్వారా పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా రైతుల అవసరాల నిమిత్తం రెండు రోజుల్లోనే 525.35 మెట్రిక్ టన్నులు రానున్నట్లు వివరించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా యూరియాను తీసుకెళ్లాలని సూచించారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం ఎగుమతులపై సుంకం విధించడంపై ఈనెల 6న నిరసన ప్రదర్శలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియ పంపిణీలో వైఫల్యం చెందడాన్ని నిరసిస్తూ ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లా కార్య వర్గసభ్యుడు సుం కయ్య, రాదాకృష్ణ, రాముడు, ప్రసాద్, భాస్కర్, నాగరాముడు పాల్గొన్నారు.

ఉమేష్‌చంద్ర సేవలు స్ఫూర్తిదాయకం

మహానంది, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర సేవలు స్ఫూర్తిదాయకమని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మహానంది పోలీస్ స్టేషన్ ఆవరణలో ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

చెంచులకు దుస్తుల పంపిణీ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంఘమిత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో జానాల, బలపాల, తిప్పపాత మాడుగుల, ఎర్రమఠం, తదితర చెంచుగూడెలలోని చెంచులకు చీరలు, పాంట్లు, చొక్కాలు, పిల్లల దుస్తులను నిర్వాహకులు పంపిణీ చేశారు.

మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ రాజకుమారి
- రూ.8.7 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వోప్లాంట్ వద్ద మెడికల్ కళాశాల సిబ్బందితో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని , బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రూ.8.70లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కోరికమేరకు రైల్వే సీఎస్ఆర్ నిధులతో ఈ ప్లాంట్‌ను నిర్మించామన్నారు. రాబోయే రోజుల్లో మెడికల్ కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కేసీకెనాల్ మెడికల్ కళాశాలలో లోపల వెళుతోందని ఆ ప్రాంతంలో గ్రీనరీ ఏర్పాటుచేసి విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామన్నారు. ఇందుకుగాను రూ.40లక్షలు ఖర్చుచేస్తామన్నారు. 15రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.5.45లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందించి ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎండీ ఫిరోజ్ జన్మదిన వేడుకలు



అభిమానులకు కేక్ తినిపిస్తున్న ఫిరోజ్, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్నం వడ్డిస్తూ.. దివ్యాంగురాలికి చక్రాల కుర్చీని అందజేస్తూ..

నంద్యాల రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల మధ్య ఫిరోజ్ కేక్‌కట్ చేశారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. వందలాది మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. శానిటేషన్ సిబ్బందికి చీరలు అందజేశారు. అలాగే పట్టణంలోని 25వ వార్డులో నివసిస్తున్న దివ్యాంగురాలు ప్రభావతికి చక్రాల కుర్చీని ఫిరోజ్ అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు రవికృష్ణ, అధ్యక్షుడు రమణయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు విజయగౌరి, నాయకులు ఇమ్మడి రామకృష్ణుడు, ప్రభుత్వాస్పత్రి కమిటీ సభ్యులు శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బెడ్‌షీట్‌ల పంపిణీ

నంద్యాల ఎడ్యుకేషన్: తెలుగుదేశం యువత నాయకులు ఎన్ఎండీ ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాల ఆర్ఎస్ రోడ్‌లోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలో విద్యార్థులకు బెడ్‌షీట్‌లతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎన్ఎండీ ఫిరోజ్, ఏవీఆర్ ప్రసాద్‌లు హాజరై విద్యార్థుల మధ్య కేకును కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటెలగల భాస్కర్‌రెడ్డి, అజ్మీర్, జార్జ్, శరత్, దివాకర్, సాగర్, ధన్‌రాజ్, దేవరాజ్, సుభాన్, ఖాసింవలి, మధుబాబు, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోబోటిక్ ప్రదర్శనలో ఆర్జీఎం విద్యార్థులు



న్యూ ఢిల్లీలో రోబోటిక్ ప్రదర్శనలో పాల్గొన్న ఆర్జీఎం విద్యార్థులు

పాణ్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రోబోటిక్ ప్రదర్శనలో ఆర్జీఎం విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు న్యూ ఢిల్లీలోని నోయిడాలో టెక్నోజియాస్ వరల్డ్‌కప్ ఛాంపియన్‌షిప్ 9.0 అంతర్జాతీయ రోబోటిక్ పోటీ ప్రదర్శన నిర్వహించారన్నారు. తమ కళాశాల ఏఐ ఎంఎల్ విభాగానికి చెందిన పది మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ ప్రదర్శనలో ఆర్‌ఓల్యాబ్‌లో నైపుణ్యం సంపాదించి విద్యార్థులు తయారు చేసిన రోబోట్‌లతో హెచ్‌ఓడీ కిషోర్‌కుమార్, అధ్యాపకులు హరగోపాల్ ఆధ్వర్యంలో తమ నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. ఈ పోటీలో 65 దేశాలకు చెందిన 3500ల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల చైర్మన్ శాంతిరాముడు, డీన్ అశోక్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ముగిసిన ఎల్ఐసీ బీమా వారోత్సవాలు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ 69 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన బీమా వారోత్సవాలు గురువారం ముగిసినట్లు ఎల్ఐసీ బ్రాంచ్‌మేనేజర్ పాండురంగనాయక్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రవికుమార్, నాగన్న, శోభారాణి, సుచిత్ర, ప్రవీణ్, లియాఫి నాయకులు అబ్దుల్‌కరీం, సాయిరాం, స్వామిదాసు, రాంబాబు, రహంతుల్లా ఉద్యోగులు, ఆత్మకూరు, నందికొట్కూరు ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రథమనందీశ్వరస్వామి ఆలయానికి రూ.25.10 లక్షల ఆదాయం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమనందీశ్వరస్వామి ఆలయంలో గురువారం పూల డెకరేషన్, లైటింగ్, సప్లయర్ సామానుల రూములకు సంబంధించి వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా రూ. 25.10లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవోలు చంద్రుడు, నాగప్రసాద్, సిబ్బంది రమణ, చలంబాబు, పాటదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పాణ్యం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా గురువారం పిన్నాపురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 166 మంది విద్యార్థులకు కంటి వైద్య సహాయకులు హనీఫ్ పరీక్షించారు. అనంతరం గ్రామంలో నేత్రదానంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమియోన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు బార్లకు రీనోటిఫికేషన్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని డోన్ పట్టణంలోని రెండు బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈఎస్ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలోని జనరల్ క్యాటగిరిలో ఒకటి, రిజర్వుడు క్యాటగిరిలో గీత కులాలకు ఒకటి రీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈనెల 14న సాయంత్రం లోగా ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తులు సమర్పించాలన్నారు. 15న కలెక్టరేట్‌లో డిప్ పద్ధతి ద్వారా బార్లను కేటాయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గురురాజ క్రీడాకారులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగాపోటీలకు గురురాజ పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఇటీవల ఆళ్లగడ్డ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 6వ తేదీ నుంచి 7 వరకు పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో జరిగే యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్
- గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫ్లెక్సీ దహనం



నందికొట్కూరులో గుమ్మనూరు జయరాం ఫ్లెక్సీని దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూరులో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్రాజెక్టు భూసేకరణ నేపథ్యంలో పరిశీలనకు వెళ్లిన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిపై దుర్భాషలాడిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పటేల్ సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫక్కీర్ సాహెబ్ ఆధ్వర్యంలో గుమ్మనూరు జయరాం ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బెస్తరాజు, గోపాలకృష్ణ, కర్ల, శ్రీనివాసులు, రామకృష్ణుడు, లింగస్వామి పాల్గొన్నారు.

- **పోరాటాలకు సిద్ధం కండి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో సీపీఎం ప్రాంతీయ వర్క్ షాపు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ సిద్ధాంతానికి కార్యకర్తలు కట్టుబడి పని చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో సీపీఎం నాయకులు స్వామన్న, ఫక్కీర్ సాహెబ్, కర్ల, గోపాలకృష్ణ, నాగమణి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

స్థాయిని మరిచి మాట్లాడడం సరికాదు

నంద్యాల రూరల్: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్థాయిని మరచి మాట్లాడడం సరికాదని సీపీఎం సీనియర్ నాయకుడు తోట మద్దులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ సాయిబాబానగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్ల నరసింహుడు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, సీఐటీయూ నాయకులు చెన్నయ్య రత్నమయ్య రామరాజు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు అమానుషం

ఆత్మకూరు: రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డిపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీరన్న, సద్దాం, రామ్‌నాయక్, రణధీర్, దినేష్, శివుడు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

మహానంది: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం మహానంది మండలం గాజులపల్లి ప్రధాన రహదారిలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రజా సంఘాల నేతలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోటకొండ బాషా, సంఘం నాయకులు వెంకటరమణ, నాగార్జున, మహేంద్ర, మద్దిలేటిలు పాల్గొన్నారు.

అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం గ్రామాలకు అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు సాయికుమర్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు ఆర్టీసీ డిపో వద్ద విద్యార్థులతో కలిసి ఎస్ఎస్‌యూఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు షబీర్, సాయి కుమార్, మహబూబ్, రేతంత్, రాకేష్, బాలు, శివ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

వెలుగోడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సకాలంలో సర్వేలను పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గుంతకందాల గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రేగడగూడూరు గ్రామంలోని సచివాలయాన్ని సైతం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో మురారి, పిఎస్ సుంకన్న సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

గడివేముల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను తప్పు లేకుండా చేయాలని అన్నారు. ప్రజలకు సంబంధిచిన ఆస్తులను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని అన్నారు. సర్వేను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహిధర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారులపై కేసు నమోదు

మిడుతూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్న వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు సంబంధిత అధికారులు యుగంధర్ బాబు, షణ్ముఖ గణేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రసాయనిక, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో కేసు నమోదు చేసి ఎరువులను సీజ్ చేశారు. వీరి వెంట వ్యవసాయ అధికారి పీరునాయక్ ఉన్నారు.

నంద్యాలలో హోటల్స్ తనిఖీ



హోటల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పాతపట్టణంలోని హోటల్స్‌ను మున్సిపల్ కమిషనర్ శేషన్న తనిఖీ చేశారు. మురుగు కాల్వల్లో చెత్తవేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి హోటల్‌లో శుచి, శుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వాడితే భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశమై నిబంధనలు తెలియజేశారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వినియోగదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.

జిల్లా రవాణా శాఖాధికారిగా జీవీ శివారెడ్డి



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జీవీ శివారెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలబొకేను అందజేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని డీటీసీని కలెక్టర్ ఆదేశించారు.

ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు జీవనోపాధి కోసం ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు (ఐద్వా) డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ బేబికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు మాట్లాడుతూ నందికొట్కూరు జీవనోపాధుల కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు 70 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారన్నారు. ఆగస్టు 15న మిషన్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఐద్వా నాయకురాలు టీబీ, లక్ష్మీదేవి, చెంచమ్మ, లబ్ధిదారులు వెంకటలక్ష్మమ్మ, సుశీలమ్మ, మద్దమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

పగిడ్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో సుభాన్ గురువారం తెలిపారు. పగిడ్యాల కేజీబీవీ బాలికల పాఠశాల ప్రిన్సి పాల్ ఉష, ఆదర్శ పాఠశాల లెక్చరర్ వెంకటేశ్వర్లు, ఎన్. గణపురం ఎంపీపీయస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముర్తుజావలి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు. గురువారం కలెక్టర్ అవార్డులు అందజేస్తారన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు సాయినాథ్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం సీఎం చంద్రబాబుతో అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా సాయినాథ్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్, అధ్యాపకులు అభినందించారు.

నంద్యాల హాస్పిటల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. శిరివెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ షేక్షావలి, గోవిందపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ శ్రీధర్, శిరివెళ్ల కేజీబీవీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్ టీచర్ షెహనాజ్‌బీలు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులను జిల్లా ఎస్‌ఏపీఈ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి దండెనాగరాజులు ప్రత్యేకంగా అభినందించారు.

శక్తి యాప్‌పై అవగాహన ఉండాలి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ జయరాం సూచించారు. గురువారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో శక్తియాప్ పోస్టర్‌లను అంటించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సీఐ జయరాం మాట్లాడుతూ మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ శక్తి వాట్సాప్ నంబర్ 7993485111ను అందుబాటులోకి తీసుకవచ్చినట్లు తెలిపారు.

శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రం ప్రాంగణలోని త్రిఫలవృక్షం సమీపంలోని దత్తాత్రేయ స్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పగిడ్యాల మండలం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున సేవా సమితి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, భజన కీర్తనలను ఈశ్వరయ్య, సుబ్బయ్య, వెంకటస్వామి, శేఖర్, మల్లారెడ్డి, శివరాములు, నాగార్జున, పరుశురాముడు, రాము, లక్ష్మీదేవి, స్వర్ణమ్మ, శ్రీనివాసులు తదితరలు ఆలపించారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- ప్రతి గ్రామంలో ఒకరిద్దరు జ్వర పీడితులు
- ఆళ్లగడ్డలో డెంగీ కేసు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలోని ఓ బాలిక (13)కు డెంగీ లక్షణాలు ఉండడంతో మొదట స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించి అనంతరం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాచేపల్లె గ్రామానికి చెందిన పవన్ కుమార్‌కు జ్వరం, వాంతులు వీరోచనలు కావడంతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇలా ప్రతి గ్రామంలో ఇంటికి ఒకరిద్దరు జ్వరం పీడితులు ఉన్నరంటే పరిస్థితి ఏమేరకు ఉందో అర్థమవుతోంది. మండలంలోని సద్దాం కాలనీ, రామలక్ష్మి కొట్టాల, దొమ్మర కాలనీ నగరం, తదితర ప్రాంతాలలో ప్రజలు జ్వరాలతో బాధపడుతు న్నారు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు జ్వరాల బాధితుల తో కిటకిటలాడుతున్నాయి. గ్రామాలలో పారిశుధ్యం లోపించడంతోనే విషజ్వరాలు వస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న చిన్నారి


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సొసైటీ అభివృద్ధికి కృషి


చైర్మన్ గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగార్జునరెడ్డి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకొప్పెర్ల సహకార పరపతి సంఘాన్ని అభివృద్ధి చేసి రైతులకు సేవలందిస్తామని చైర్మన్ గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కలుగొట్ల గ్రామంలో సీఈవో ఎస్.కరీం అధ్యక్షతన నూతన చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లుగా చదుర్ల శివశంకర్‌రెడ్డి, బోయ బాలరాజు బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌ను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్య క్షుడు నాగార్జున రెడ్డి, నాయకులు గడ్డం జగదీశ్వర్‌రెడ్డి, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, లింగాల నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సొసైటీ చైర్మన్‌గా వివేకానందరెడ్డి ప్రమాణ స్వీకారం



కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సొసైటీ చైర్మన్‌గా చింతలాయపల్లె గ్రామానికి చెందిన అంబటి వివేకానందరెడ్డి శుక్రవారం ప్రమా ణ స్వీకారం చేయనున్నారు. తమ కుటుంబంపై నమ్మకంతో తనకు సొసైటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వివేకానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులుగా పేట్నికోట కేవీ శివారెడ్డి, బెలుం సత్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రి బీసీ సహకారంతో కొలిమిగుండ్ల సహకార సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి అన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. సభకు ఎంపీపీ మహమ్మద్ వసీం అధ్యక్షతన వహిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.


మంత్రి సత్యకుమార్‌ను కలిసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించాలి

బనగానపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఏరియా వైద్యశాలకు సూపరింటెండెంట్‌ను నియమించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను మంత్రి బీసీ కలిసి విన్నవించారు. వందపడకల ఆస్పత్రిలో సూపరింటెండెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి సత్యప్రకాశ్ త్వరలో సూపరింటెండెంట్‌ను నియమిస్తామని హామీ ఇచ్చారు.

కోవెలకుంట్లలో ఆగిన యూరియా రైలు

- భద్రత కల్పించిన పోలీసులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో యూరియాతో వచ్చిన రైలు గురువారం మధ్యాహ్నం మూడు గంటల పాటు నిలిచింది. దాంతో కోవెలకుంట్ల పోలీసులు రైలుకు భద్రత కల్పించారు. యూరియా కోసం రైతులు ఆందోళనలు చేయడం విధితమే. అయితే ప్రభుత్వం స్పందించి ఇతర రాష్ట్రాల నుంచి రేణిగుంట నుంచి కడప మీదుగా నంద్యాలకు రైలు ద్వారా యూరియాను తెప్పిస్తోంది. అయితే, కోవెలకుంట్లకు మధ్యాహ్నం 12 గంటలకు యూరియా రైలు చేరుకుంది. మద్దూరు వద్ద రైల్వేట్రాక్ పనులు జరుగుతుండటంతో సుమారు మధ్యాహ్నం 4వరకు కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో ఆగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైతులకు సేవలందిస్తా

- హనుమంతుగుండం సహకార సంఘం చైర్మన్ మూల శివారెడ్డి


మూల శివారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో రైతులకు సేవలందిస్తానని హనుమంతుగుండం సహకార సంఘం నూతన చైర్మన్ మూల శివారెడ్డి అన్నారు. గురువారం హనుమంతుగుండం సొసైటీ చైర్మన్‌గా శివారెడ్డి, సభ్యులుగా వెంకటేశ్వరరావు, నిమ్మకాయల దస్తగిరి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు పులి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఇటిక్యాల బాలిరెడ్డి, అంబటి జయలక్ష్మిరెడ్డి హాజరయ్యారు. సహకార సంఘం సబ్ డివిజనల్ అధికారి ప్రభాకరరావు, అసిస్టెంట్ మేనేజర్ ప్రతాపరెడ్డి పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో గొంగటి హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, సంజామల మండల అధ్య క్షులు మంచాల మద్దిలేటిరెడ్డి, పేరుసోముల శంకరరెడ్డి, చిన్న శేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు, కత్తి రాందాస్, కోటపాడు శివరామిరెడ్డి, సూరి, వెంకటేశ్వర్లు, చిట్టి, తోటశివారెడ్డి, అంబటి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి


జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ అప్పల స్వామి

చాగలమర్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు పొదుపు పథకాలను వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ అప్పల స్వామి తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. పోస్టల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ పరిధిలోని పొదుపు పథకాలను వివరించాలని అన్నారు. పోస్టల్‌లైఫ్ ఇన్సూరెన్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్లు రంజిత్‌కుమార్, భాస్కర్‌రావు, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ప్యాపిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. పెద్దపూదిళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ వర్గీయుడు విజయుడు, ఆయన కుమారుడు ప్రసాద్ మృతదేహాలకు గురువారం ఎమ్మెల్యే కోట్ల నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపీర్, సుదర్శన్, రాంభూపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్

డోన్ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన కుమ్మరి సుధాకర్ గురువారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేను అందజేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే పరిశీలన

శిరివెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామినేనిపల్లె, కోటపాడు గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వే పనులను డీఎల్‌డీవో శివారెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజల సామాజిక-ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక


హరి ప్రసాద్ | శివనాగేశ్వరరావు | మహబూబ్‌బాషా | హబి మున్నిసా | ఖాశీం సాహెబ్ | సుదర్శన్

బనగానపల్లె/చాగలమర్రి/రుద్రవరం/ప్యాపిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలువురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి అవార్డులను అందజేయనున్నారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేట ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు గుండా హరిప్రసాద్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సీ.శివనాగేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో స్వరూప గురువారం తెలిపారు. చాగలమర్రి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.మహబూబ్‌బాషా (భౌతికశాస్త్ర), కస్తూర్బా పాఠశాలలో సీఆర్టీ హిందీ ఉపాధ్యాయురాలు హబిమున్నిసా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్‌ఎం జీవయ్య, ఎస్‌వో స్వప్న, ఎస్టీయూ, పీఆర్టీ యూ సంఘ నాయకులు అభినందించారు. రుద్రవరం మండలం యల్లావత్తుల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఖాసింసాహెబ్ (గణితం), నాగులవరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో వీర రాఘవయ్య తెలిపారు. ప్యాపిలి మండలం హుసేనాపురం హైస్కూల్ ఉపాధ్యాయుడు సర్వజ్ఞమూర్తి (తెలుగు), నేరేడుచెర్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాంబశివుడు, పట్టణంలోని కిందిగేరి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హర్‌నాథ్‌రెడ్డి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి యూటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్నఅసోసియేషన్ సభ్యులు

డోన్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పవన్ కుమార్, మాధవీలను సన్మానించారు. ముఖ్యఅతిథిగా డోన్ రూరల్ ఎస్ఐ మమత మాట్లాడారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ గౌరవాధ్యక్షుడు న్యాయవాది నాగభూషణంరెడ్డి, అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన మినుము దిగుబడి


రోడ్డుపై ఆరబోసిన మినుములు

రుద్రవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా సాగు చేసిన మినుము పంట వర్షాలకు దెబ్బతినడంతో దిగుబడి తగ్గిందని గురువారం పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందని పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఎంతో ఆశతో సాగు చేస్తే మినుము పంట నిరాశే మిగిల్చిందన్నారు. దిగుబడి వచ్చిన మినుములు కూడా నాశిరకంగా ఉన్నాయని రైతులు తెలిపారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

రుద్రవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం చిన్నకంబలూరు సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పర్య టించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వీఆర్వో నారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చాగలమర్రి: సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు సమయ పాలన పాటించి విధులు నిర్వహించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో గల సచివాలయాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదినారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

శిరివెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాలు దూరమవుతాయని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ఆంజనేయులు నాయక్ అన్నారు. శిరివెళ్లలోని బలిజపేటలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

9,300 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు

దొర్నిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు 9,300 మెట్రిక్ టన్నులు యూరియా మంజూరైనట్లు వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు, సొసైటీలకు యూరియా మంజూరైందని అన్నారు. యూరియాను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు అంజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ముళ్లకంప తొలగింపు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ముదిగేడు రహదారిలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషను ముందు ఉన్న మురుగు కాల్వలో ముళ్లకంపను తొలగించారు. మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నట్లు ప్రజలు ఫిర్యాదు చేశారు. గురువారం ఈవోఆర్‌డి, ఈవో ప్రకాశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో కాల్వలో ముళ్లకంపను తొలగించి శుభ్రం చేయించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్యాపిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుక్మిణి, మురళీమోహన్, సచిఆలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలి

ప్యాపిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ అలవర్చాలని సీడీపీవో షంషాద్‌బేగం అన్నారు. గురువారం హుసేనాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలువురు అంగనవాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వాధులు ప్రబలుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యులు హరిచరణ్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో వాతావరణ మార్పులతో జ్వరాలు, దగ్గు, జలుబు కేసులు అధికంగా ఉన్నాయన్నారు. ప్రజలు కాచి, వడబోచిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.